క్లుప్తంగా

రేపు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

పిడుగురాళ్ల: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక గురువారం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు అందాయన్నారు. దానికనుగుణంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ మురళీకృష్ణ

పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్‌గా గురజాల ఆర్డీఓ మురళీ కృష్ణను ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికలకు సహకరించాలని ఆయన సూచించారు.

వైభవోపేతంగా నగర సంకీర్తన

గురజాలరూరల్: మాఘ మాసం పురస్కరించుకుని పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నగర సంకీర్తన వైభవోపేతంగా మంగళవారం నిర్వహించారు. దేవాలయం నుంచి శివదీక్ష స్వాములు పార్వతి పరమేశ్వరుల ప్రతిమలను చేతబూని నగర సంకీర్తనలో పాల్గొన్నారు. మహిళలు స్వామి వారికి నీటిని వారుగా పోసి స్వాగతం పలికారు. స్వాములు జోలా భిక్షాటన చేశారు. భక్తులు స్వామి వారికి బియ్యం, కందిపప్పు, బెల్లం, పండ్లు, కూరగాయలతో పాటు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



గురజాల రూరల్: స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన బొగ్గవరపు వెంకటేష్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గుండా సాంబ, కట్టమూరి గోపి, మాడా వెంకటేష్, అధ్యక్షుడు గుండా కాశీ, బండి రవికుమార్, కనకం హనుమంతురావు ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం, 5 గంటలకు ఊరేగింపు ఉంటాయని తెలిపారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో ఘంటసాల విగ్రహం వద్ద ఘంటసాల వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో రాఘు సుధ కళా పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్ర పరిశ్రమకు అందించిన సేవలను పలువురు కొనియాడారు. పాండు రంగ శ్రీను, ముప్పాళ్ల సాంబశివరావు, గుడివాడ కుటుంబరావు, కొత్త రాధ, ఆత్మకూరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

మేరి క్యూరీ విద్యార్థులకు ఆదర్శం



రెంటచింతల: నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి మహిళగా పేరు పొందిన ప్రముఖ శాస్త్రవేత్త మేరి క్యూరీని విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకులంలో అంతర్జాతీయ మహిళా, బాలికల దినోత్సవం నిర్వహించారు. శాస్త్రవేత్త మేరి క్యూరీ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. భౌతిక, రసాయనిక శాస్త్రవేత్త మేరి క్యూరీ 1903, 1911లో రెండు సార్లు నోబెల్ బహుమతులను వైజ్ఞానిక రంగంలో పొందినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయునులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయనులు భాగ్య మేరి, పి.సత్రాజ్ బేగం, ఎం.అరుణకుమారి, కేవీ నారాయణమ్మ, గ్రామ పెద్దలు గాదె లూర్థుమర్రెడ్డి పాల్గొన్నారు.

పునాది ఆశలు సమాధి

- గత ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు మంజూరు
- జగనన్న కాలనీలతో 4,480 మందికి లబ్ధి
- కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన
- ఆశలతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన బిల్లులు
- బేస్‌మట్టంలోనే నిలిచిపోయిన నిర్మాణాలు



పట్టణ శివారు జగన్న కాలనీలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు

మాచర్ల రూరల్: బడుగు, బలహీన వర్గాల సొంతింటి కల గాలిలో దీపంలా మారింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేదల గూడు ఘోషిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల పథకం పేరును మన ఇళ్లు - మన గౌరవంగా మార్చింది. పేరు మార్చే కానీ గృహ నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది.

నిలిచిన నిర్మాణాలు

పేదలకు కేటాయించిన గృహ నిర్మాణాలు పూర్తి చేయడంలో కూటమి సర్కార్ విఫలమైంది. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటుతున్నా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. మాచర్ల పట్టణంలోని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చటమే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల కోసం నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. అందులో భాగంగా జగనన్న కాలనీలను నిర్మించి, ఉచితంగా రూ.లక్షలు విలువ చేసే ఇళ్ల స్థలాలిచ్చారు. విశాలమైన రోడ్లు, విద్యుత్, వాటర్ ట్యాంక్‌ల సౌకర్యాలు కల్పించారు. ఇంటి నిర్మాణానికి రుణాలు కూడా అందించి ప్రోత్సహించింది గత ప్రభుత్వం. పట్టణంలోని టిడ్కో గృహ నిర్మాణాల ప్రాంతం, బ్రహ్మనాయుడు చెరువు, గంగయ్యకుంట చెరువు, రొంటబుట్ట బోడు, ఎన్ఎస్పీ కాలని, వినాయకుని గుట్ట ప్రాంతాల్లోని జగనన్న కాలనీలకు 5,292 లబ్ధిదారులను ఎంపిక చేయగా వారిలో 4,480 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణ జాబితాలో చోటు సంపాదించుకున్నారు.

బేస్‌మట్టంలోనే..

చాలా మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పునాదులు తీసి, బేస్‌మట్టాలు వేశారు. మరికొందరు పిల్లర్లు లేపి వెంటిలేషన్, కొంత మంది శ్లాబులు వేసి నిర్మాణాన్ని పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే గృహ నిర్మాణాలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. దీంతో పేదలందరికీ ఇళ్ల పథకం ఎప్పుడు పూర్తవుతుందో అర్థం కాక లబ్ధిదారులు నిరాశ, నిస్పృహలతో ఉన్నారు. నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు విడతల వారీగా చెల్లించాల్సిన బిల్లుల్లో జాప్యం, సకాలంలో బిల్లులు రాక సొంతింటి నిర్మాణాలకు అప్పులు చేసిన వారు ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. దీంతో పేదవాడి సొంతింటి కల నెరవేరేనా అని ప్రశ్నార్థకంగ మారింది.

సత్రశాలలో ముమ్మరంగా శివరాత్రి ఏర్పాట్లు



కృష్ణానది ఘాట్‌లో ఐరన్ మెస్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సత్రశాల(రెంటచింతల): ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈ నెల 26న మహా శివరాత్రి వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి మంగళవారం తెలిపారు. అతిపురాతనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధిచెందిన సత్రశాల దేవస్థానానికి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఏలాంటి ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా బారికెడ్లు, మంచినీటి సదుపాయం, పార్కింగ్, మహిళలు స్నానాలు చేసేందుకు కృష్ణానది వద్ద వసతి, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జెన్ కో నాగార్జున సాగర్ టైయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో మహా శివరాత్రికి తరలివచ్చే భక్తులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మహా శివరాత్రి రోజు భక్తులకు సేవ చేయడానికి మంచి మనస్సుతో యువతియువకులు వలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలన్నారు. ఆసక్తి కలిగిన వారు 99496 46208, 77801 34383 మొబైల్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కనుల పండువగా గోపయ్యస్వామి కల్యాణోత్సవం



గురజాల: లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. స్థానిక పల్లెగుంత రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లను భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పాల్గొన్నారు. పూజారి ఎం.పవన్ కుమార్ వేదమంత్రాల మత్రోచ్చరణతో స్వామి వారి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

దాచేపల్లి: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ముత్యాలంపాడు రోడ్డులో ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి 14వ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ పూజారి నల్లజర్ల నారాయణ పర్యవేక్షణలో స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం తిరుపతమ్మతల్లి, గోపయ్య స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. భక్తుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బీసీలకు ఇచ్చే గౌరవం ఇదేనా?



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకులు

గురజాలరూరల్: బీసీ మహిళ, మాజీ మంత్రి విడదల రజనీకి కూటమి నాయకులు ఇచ్చే గౌరవం ఇదేనా అని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం బీసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు విడదల రజనీపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఇదేక్కడి న్యాయమన్నారు. విడదల రజనీపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు పెట్టారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. విడదల రజనీ రాజకీయంగా ఎదుగుతుందని తట్టుకోలేకనే ఇటువంటి ఘటనలకు కూటమి నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు రజనీపై పెట్టిన అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, కో-ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, షేక్ నాసర్‌సైదా, ముదిరాజు నాయకులు కె.సైదయ్య, జి.కోటేశ్వరరావు, కె.వెంకటేష్ తదితరులున్నారు.

విద్యార్థినుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



విజయపురిసౌత్: విద్యార్థినుల భద్రతపై పాఠశాల యాజమాన్యం అప్రమత్తంగా ఉండాలని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక బాలయోగి బాలికల గురుకుల పాఠశాలను సీఐ పరిశీలించారు. పాఠశాలలోని సీసీ కెమెరాల పర్యవేక్షణ పై ఆరా తీశారు. పాఠశాలలోని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రిన్సిపల్ మేరీ మంజులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేనిదే బయట వ్యక్తులను పాఠశాలలోకి అనుమతించారదని సిబ్బందికి తెలియజేశారు. సీఐ వెంట విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, సిబ్బంది ఉన్నారు.

కరుణ, దయ కలిగిన తల్లి లూర్థు మాత



విచారణ గురువు రె.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: కరుణ, దయ కలిగిన తల్లిగా భక్తులు కొనియాడుతన్న లూర్థు మాతను ప్రార్థిస్తే తప్పక ఆ కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లువిరిస్తాయని కానుకమాత చర్చి విచారణ గురువు రె.ఫాదర్ ఏరువ లూర్థు మర్రెడ్డి అన్నారు. స్థానిక లూర్థు మాత మందిరం 104వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి ఫాదర్ ఏరువ లూర్థు మర్రెడ్డి మాట్లాడారు. ఆత్మ ప్రభువు కోసం స్తుతించుచున్నది అని లూర్థుమాత చెప్పిన వాక్యంలో ఎంతో అర్థం దాగి ఉందన్నారు. ప్రతి ఒక్కరు మంచి జీవితం కోసం జపమాల మాతగా దర్శనమిచ్చిన లూర్థు మాతను ప్రార్థించాలన్నారు. చర్చిని రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సహాయ గురువులు పి.అగస్టీన్, కన్య స్త్రీలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మితిరుపతమ్మ కల్యాణం



మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో జెడ్పీ హైస్కూల్ సమీపంలోని ఆలయం నందు శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్యల కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దంపతులు పీటలపై కూర్చొని అమ్మవారి కల్యాణం జరిపించారు. ప్రత్యేక పూజా క్యాక్రమాలు చేపట్టారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీఆర్కే ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న కౌన్సిలర్లు

మాచర్ల రూరల్: ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ, పిన్నెల్లి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని మున్సిపల్ కౌన్సిలర్లు మాచర్ల సుందరరావు, వేల్పుల గురవయ్య, మందా సంతోష్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని 30వ వార్డులో నివాసముంటున్న ఆలేటి రత్నకుమారి ఆకస్మికంగా మృతి చెందటంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయమందించి, మాట్లాడారు. ఆలేటి రత్నకుమారి మరణాన్ని తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో మరియమ్మ కుటుంబానికి పార్టీ తరపున అన్నీ విధాలా అండగా ఉంటామని పీఆర్కే భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు. లెదర్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బూదాల మరియమ్మ, పాస్టర్ వేల్పుల దానియేలు, కందుకూరి మధు, కోటా రాజేష్, కొమ్ము బొంగురు, మాచర్ల యోహాను, మేడి కృష్ణారావు ఉన్నారు.

జగన్నాథం మృతికి నివాళులు

సత్తెనపల్లి: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన మల్లెం జగన్నాథం (80) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి జగన్నాథం భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, కూకుట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు ప్రదర్శన

జూనియర్, సీనియర్ విభాగాల్లో సత్తా చాటిన వేటపాలెం ఎడ్ల జతలు



ప్రథమంలో నిలిచిన వేటపాలెం ఎడ్ల జత

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వృషభరాజాల బండలాగుడు బల ప్రదర్శనలు హోరాహోరీగా జరిగాయి. మంగళవారం జూనియర్ విభాగంలో అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరి (వేటపాలెం, చుండూరు మండలం, బాపట్ల జిల్లా) ఎడ్లు 3656.6 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. డి.రోహన్ (హైదరాబాద్, తెలంగాణ)ఎడ్ల జతలు 3647.10 అడుగులు, 3374 అడుగులు దూరాన్ని లాగి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఆలా మోహన్ రావు, పాటిబండ్ల శ్రీనివాసరావు (నాగులపాడు, పెదనందిపాడు మండలం, గుంటూరు జిల్లా) కంబైన్డ్ ఎడ్ల జత 3,241 అడుగులు లాగి నాలుగో స్థానంలో, యల్లం సాంబశివరావు (లింగాయపాలెం, గుంటూరు) ఎడ్లు 3207.2 అడుగులు లాగి ఐదో స్థానంలో, కాకర్ల సురేష్‌బాబు (నాదెళ్లవారిపాలెం, చల్లపల్లి మండలం, కృష్ణా జిల్లా) ఎడ్లు 3009.3 అడుగులు లాగి ఆరో స్థానంలో, యరాని సుబ్బయ్య (పమిడిమర్రు, నర్సరావుపేట మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు 2678 అడుగుల దూరాన్ని లాగి ఏడో స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

సీనియర్ విభాగంలో...

అత్తోట సిరిషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 3,049 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బోరేరెడ్డి కేశవరెడ్డి(పెదకోట్ల, నంద్యాల జిల్లా), సుంకి సురేందర్‌రెడ్డి(హుజూర్ నగర్, తెలంగాణ), ఉమ్మడి జత 3010.7 అడుగుల దూరం లాగి రెండవ స్థానం, కుందూరు రామ్‌గోపాల్‌రెడ్డి(గుంపుమాం దిన్నె, సిరివెళ్ల మండలం, నంద్యాల జిల్లా) ఎడ్లు 2935.6 అడుగులు లాగి తృతీయ స్థానంలోను, కుర్ర వెంకటేష్ యాదవ్(మైదుకూరు, కడప జిల్లా) 2,802 అడుగులు, కటకం లక్ష్మణకుమార్ (ఇనిమెట్ల, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా) ద్వారా శిల గురివిరెడ్డి (వి.ఎంఆర్ కాలనీ పొద్దుటూరు, కడప జిల్లా)2712.2 అడుగులు, మేకా కృష్ణ మోహన్(ఘంటసాల, కృష్ణా జిల్లా), మక్కెన కోటేశ్వరరావు(టంగుటూరు, ప్రకాశం), ఉమ్మడి జతలు 2,659 అడుగులు, 2,078 అడుగుల దూరం లాగి వరుస స్థానాల్లో నిలిచి వరుస బహుమతులను కైవసం చేసుకున్నాయి.

14న మండల సమావేశం

ముప్పాళ్ళ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో పీ.జే.విలియమ్స్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి గౌరవ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నకరికల్లు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రత, మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యాలు, ఓటర్ల క్యూలైనుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఆటంకం లేకుండా పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి వెంట తహసీల్దార్ కె.పుల్లారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళలు చట్టాలు గురించి తెలుసుకోవాలి

సత్తెనపల్లి: మహిళలు గౌరవంగా బ్రతకడానికి అనేక చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాలను ప్రతి మహిళ తెలుసుకోవాలని సచివాలయ మహిళా పోలీస్ నందిని అన్నారు. పట్టణంలోని 16వ వార్డు చెంచు కాలనీలో మహిళలకు మహిళా హక్కుల సంక్షేమం, అభివృద్ధిపై మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలకు రక్షణ చట్టాలు అనేకం ఉన్నాయని, వాటిని వినియోగించుకొని ధైర్యంగా సమాజంలో గౌరవంగా బ్రతికే అవకాశాన్ని తెలుసుకోవాలన్నారు.డీబీఆర్సీ ప్రోగ్రాం కోర్డినేటర్ హేమలత మాట్లాడుతూ స్త్రీకి ముఖ్యంగా చదువు ఉండాలని, మీరు చదువుకోలేక పోయినా మీ ఆడపిల్లలను చదివించాలన్నారు. డీబీఆర్సీ రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ మొదటి నుంచి వారికి విద్యాబుద్ధులు నేరించే విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సదస్సుకు 3 ఏరియాల నుంచి చెంచు, బుడగ జంగాల కాలనీ, యానాది కాలనీ మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా సంఘ బాధ్యులు పినపాటి ఈశ్వరి, తిరుపతి, క్రిస్టియన్మ్మ, పచ్చిగుర్ల బేబీ, మహిళలు పాల్గొన్నారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



విద్యార్థులకు వివేకానంద పుస్తకాలు అందజేస్తున్న గోవిందరెడ్డి

తుమ్మకోట(రెంటచింతల): విద్యార్థులు నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకుని మానవ సేవే మాధవ సేవ అన్న స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్వామి వివేకానంద రామకృష్ణ మిషన్‌ను స్థాపించి 125 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని తుమ్మకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వామి వివేకానంద సాహిత్యంపై జాగృతి పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. నియోజకవర్గంలోని పాఠశాలలు, కళాశాలల్లో వివేకానంద సాహిత్యంపై జాగృతి పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాసు శౌరెడ్డి, విశ్రాంతి ఎంఈఓ జి. వెంకటేశ్వరరావు, ప్రసాద్ మాష్టర్, శ్రీ రామకృష్ణ సేవా సమితి తుమ్మకోట అధ్యక్షులు రామయ్య, సభ్యులు పల్బూరి కిశోర్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పిడుగురాళ్లను తీర్చిదిద్దుదాం



సిబ్బందితో మాట్లాడుతున్న కమీషనర్ పర్వతనేని శ్రీధర్

పిడుగురాళ్ల: స్వచ్ఛ పిడుగురాళ్లగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సచివాలయ, మెప్మా సిబ్బందితో ఆయన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పిడుగురాళ్లలోని రోడ్లన్ని పరిశుభ్రంగా ఉండాలే చూద్దామన్నారు. మురుగు సత్రమంగా పారే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో పిడుగురాళ్లను స్వచ్ఛ పిడుగురాళ్లగా తీర్చిదిద్దుదామని, అందుకు అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు.ఇందుకు ఒక యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని, దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



రైతులకు బహుమతులు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే రైతన్నకు అండగా ఉండి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేలా కోరమండల్ సంస్థ పనిచేస్తుందని రీజనల్ డైరెక్టర్ కేఎస్ఆర్ చక్రవర్తి, జోన్ మేనేజర్ ఎన్.హరి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోరమండల్ కంపెనీ నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందించడమే కాకుండా వారికి ఆధునిక సేద్యంపై అవగాహన కలిస్తుందన్నారు. రైతు సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా తాము పనిచేస్తామని, కోరమండల్ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లాటరీ ద్వారా ట్రాక్టర్లు, ఎరువులు అందించామన్నారు. డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేసే విధానాన్ని కూడా వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. లాటరీలో రెండు ద్విచక్ర వాహనాలను గెలుచుకున్న రైతులు ఇలాసాగరం యేగయ్య, షేక్ ఇమాంసాకు బుల్లెట్ వాహనాలందించారు. సీనియర్ మేనేజర్ టి.తిరుపతిరావు, మార్కెటింగ్ మేనేజర్ అశ్వనీకుమార్ రెడ్డి, రజాక్ కోటయ్య, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సోషల్ ఆడిట్

అచ్చంపేట: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కె.ఎస్.రాజు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ బృందం మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్, సీఐ వెంకటప్రసాద్‌లు పరిశీలించారు. విద్యార్థులకు అందచేస్తున్న మధ్యాహ్న భోజనం, డార్మిటరీలోని వసతులు, నీటి వసతి, మరుగుదొడ్లు, విద్యార్థులకు అందచేసే కాస్మోటిక్స్ వంటి సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందాల్సిన యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ గురించి ఆరా తీశారు. విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సదుపాయాలు ఏర్పాటు చేస్తుందని, వాటిని విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దారు కళాశాల స్పెషల్ అధికారి జ్యోత్స్నకు సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందించాలన్నారు. మార్చిలో జరిగే టెన్త్, ఇంటర్ విద్యార్థుల పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.